# ఒడిషా కామ్రేడ్ బాటకృష్ణన్ స్వైన్‌పై పోలీసుల క్రూర నిర్బంధం

**ఒడిషా** రాష్ట్రంలో జరుగుతున్న సిపాసిరుబలి భూ ఉద్యమంలో నాయకుడు, ఉపకులియ జమి ఓ జంగల్ సురఖ్య సమితి కన్వీనర్ అయిన బాటకృష్ణన్ స్వైన్‌పై పూరి స్థానిక పాలనా యంత్రాంగం కక్షపూని వ్యవహరిస్తోంది. స్థానికంగా తమ భూముల, అడవుల పరిరక్షణ కోసం పోరాడుతున్న ప్రజానీకపు డిమాండ్లకు మద్దతుగా రాజీలేకుండా నిలబడడమే ఆయన చేసిన నేరం. పర్యావరణ పర్యాటకం పేరుతో ఒడిషా ప్రభుత్వం అనేక భూములను, తీరప్రాంతాన్ని, అడవులను బడా సంపన్నులకు కట్టబెడుతోంది.

ఈవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై సిపాసిరుబలి ప్రాంతంలో అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి, పర్యాటక అభివృద్ధి పథకంలో భాగంగా షముక హోటల్ నిర్మాణానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. గ్రామస్థులందరితో కూడి ఉపకులియ జమి జంగల్ సురఖ్య సమితి' ఆధ్వర్యంలో కామ్రేడ్ బాటకృష్ణన్ దీనిని ప్రతిఘటించడంలో ముందు నిలిచాడు. ఈ గొంతును అణచివేయటం కోసం ఆయనపై పలు అక్రమ కేసులు బనాయించి, అరెస్టులు చేసి, నిర్బంధానికి గురిచేస్తున్నారు.

ప్రజలు తమ హక్కులను కాపాడుకోవటానికి తమ అసమ్మతిని, అసంతృప్తిని వ్యక్తం చేయటమనేది ప్రజాస్వామిక సమాజాల సారాంశం. కానీ ప్రభుత్వం నేరపూరితమై ఇలాంటి గొంతుకలన్నింటినీ కార్పొరేట్ల ప్రయోజనాల కోసం నొక్కి వేయటమనేది, రాజ్యాంగం ప్రకారం పౌరులందరికీ కల్పించా మంటున్న ప్రజాస్వామ్య హక్కులపై గొడ్డలివేటు.

కా॥ బాటకృష్ణన్‌ను గత 8 నెలల కాలంగా జైలులోనే నిర్బంధించారు. ఈ ఎనిమిది నెలల కాలంలో ఒకదాని తర్వాత మరొకటిగా ఆయనపై తప్పుడు ఆరోపణలతో పోలీసులు కేసులు బనాయిస్తూ వస్తున్నారు. ప్రజాస్వామికవాదులైన న్యాయవాదులు ఈ కేసులన్నింటిలో బెయిల్ తీసుకువచ్చారు. చివరి కేసులో బెయిల్ వచ్చిన తర్వాత ఏప్రిల్ 12న ఆయన విడుదలై జైలు నుండి బయటకు వచ్చిన వెంటనే, జైలు ముఖద్వారం వద్దే మరో కేసులో పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. జాతీయ భద్రతా చట్టం క్రింద కేసు నమోదు చేశారు. మే 2వ తేదీన జాతీయ భద్రతా సంస్థ కా॥ బాటకృష్ణన్ స్వైన్‌ను తన కస్టడీలోకి తీసుకుంది.

ఒడిషాకు చెందిన వివిధ ట్రేడ్ యూనియన్స్, ప్రజాస్వామిక హక్కుల సంఘాలు, ప్రగతిశీల శక్తులతో కూడిన 'జన అధికార మంచ్' కామ్రేడ్ బాటకృష్ణన్‌పై రాజ్యం కొనసాగిస్తున్న నిర్బంధాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఆ సంస్థ కన్వీనర్ విశ్వప్రియ కనుంగో ఆధ్వర్యంలో ఈ క్రింది డిమాండ్లను ప్రభుత్వం ముందుంచుతున్నది.

★ కామ్రేడ్ బాటకృష్ణన్ స్వైన్‌ను వెంటనే విడుదల చేయాలి; ఆయనపై బనాయించిన అన్ని అక్రమ కేసులను ఉప సంహరించుకోవాలి.

★ ధింకియా, మాలిపర్‌బాత్ ప్రాంతాలలోని కార్యకర్తలపై బనాయించిన క్రిమినల్ కేసులన్నింటినీ ఎత్తివేయాలి.

★ ఐపిసిలోని క్రిమినల్ సెక్షన్లను ప్రజాఉద్యమాల గొంతు నొక్కటానికి ఉపయోగించటం విరమించుకోవాలి.

★ ప్రజలను వారి భూములను లూటీచేసి, పర్యావరణ వ్యవస్థను విధ్వంసం చేసే ప్రాజెక్టులకు వ్యతిరేకంగా అసమ్మతి, అసంతృప్తులను తెలియజేసే గొంతులను నేరపూరితంగా అణచి వేయటం ఆపివేయాలి.

'జనశక్తి' కా॥ బాటకృష్ణన్ స్వైయిన్‌పై నిర్బంధాన్ని తీవ్రంగా ఖండిస్తోంది. ఆ కామ్రేడ్‌పై రాజ్యం అమలుచేస్తున్న నిర్బంధాన్ని ఖండించ వలసిందిగా అతన్ని తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేయవలసిందిగా ప్రజాస్వామికవాదులందరికీ విజ్ఞప్తి చేస్తోంది.

★★★★★